క్లుప్తంగా

రమాదేవి భానోజీరావు సేవలు స్ఫూర్తిదాయకం



రమాదేవి భానోజీరావు చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న అదీప్ భానోజీరావు తదితరులు

అల్లిపురం: రమాదేవి భానోజీరావు సేవలు స్ఫూర్తిదాయకమని మిసెస్ ఏవీఎన్ కాలేజీ కరస్పాండెంట్ ఏవీ అదీప్ భానోజీరావు అన్నారు. దాబా గార్డెన్స్‌లో గల రమాదేవి భానోజీరావు ఉన్నత పాఠశాలలో బుధవారం ఆయన రమాదేవి భానోజీరావు చిత్రపటానికి పూల మాల వేసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మిసెస్ ఏవీఎన్ కాలేజీ ప్రిన్సిపాల్ ఎం. సింహాద్రినాయుడు, ఏవీఎన్ స్కూల్ హెచ్ఎం ఎం.వి. భానుమతి శ్రీనివాస్, పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ టీవీ మురళి, రమాదేవి స్కూల్ హెడ్మాస్టర్ ఎస్.శ్రీనివాసరావు, ఇన్‌చార్జి హెచ్ఎం హెచ్. ప్రభాకర్, సీఆర్‌పీ రత్న, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కుటుంబం చెంతకు కర్ణాటక వ్యక్తి



ఆంజనేయను అతని సోదరుడు మౌనేష్‌కు అప్పగిస్తున్న శ్రద్ధ ఫౌండేషన్ సభ్యులు

అల్లిపురం: తల్లి మృతి చెందడంతో మానసిక స్థితి బాగులేక రోడ్లు పట్టి తిరిగిన కర్ణాటక రాష్ట్రం, రాయచూర్ జిల్లా, సముద్ర గ్రామానికి చెందిన ఆంజనేయ అనే వ్యక్తిని ఏయూటీడీ, శ్రద్ధ ఫౌండేషన్ సభ్యులు కుటుంబానికి అప్పగించారు. నాలుగేళ్ల క్రితం అతను రాయచూర్ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందినప్పటికీ మానసిక వ్యాధి నయం కాలేదు. దాంతో అతను ఊరు వదిలి విశాఖ చేరుకున్నాడు. 2024లో ఏయూటీడీ రెస్క్యూ చేసి ఆశ్రయం కల్పించింది. శ్రద్ధ ఫౌండేషన్ ద్వారా మందులు వాడటంతో ఆరోగ్యం మెరుగుపడింది. దీంతో అతని వివరాలు తెలుసుకున్న శ్రద్ధ ఫౌండేషన్ సిబ్బంది కర్ణాటలో సముద్ర గ్రామానికి తీసుకెళ్లి అతని సోదరుడు మౌనేష్‌కు అప్పగించారు. దీంతో వారు కృతజ్ఞతలు తెలిపారు.

అలరించిన కవి సమ్మేళనం



కవిత చదివి వినిపిస్తున్న రచయిత కుప్పిలి భీమేశ్వరరావు

సీతంపేట: సహృదయ సాహితీ ఆధ్వర్యంలో బుధవారం రాజేంద్రనగర్ ప్రిజమ్ కళాశాలలో నిర్వహించిన కవి సమ్మేళనం అందరినీ అలరించింది. ముఖ్య అతిథి రచయిత డాక్టర్ డి.వి.సూర్యారావు మాట్లాడుతూ కవులకు అధ్యయనం, భాషా పరిజ్ఞానం, భావ పరిపుష్టి ఉండాలని సూచించారు. సభాధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ కవిత్వానికి నిజాయితీతో కూడిన ఆలోచన, ఉద్వేగాలు ముడిసరకుగా ఉండాలన్నారు. అనంతరం జరిగిన కవి సమ్మేళనంలో కుప్పిలి భీమేశ్వరరావు, సీహెచ్ చిన సూర్యనారాయణ, కె.రాంప్రసాద్, కొత్తూరు రమణ కవితలు చదివి వినిపించారు.

రైల్వే ఆస్పత్రిలో అత్యాధునిక రిఫ్రిజిరేటర్ల ప్రారంభం



ఆధునిక రిఫ్రిజిరేటర్లను ప్రారంభిస్తున్న డీఆర్ఎం లలిత్‌బోహ్రా, ఈకార్వో ప్రెసిడెంట్ జ్యోత్స్న బోహ్రా

తాటిచెట్లపాలెం: డివిజినల్ రైల్వే ఆస్పత్రిలో బుధవారం మూడు అడ్వాన్స్‌డ్ ఐస్‌లైన్ రిఫ్రిజిరేటర్లను డీఆర్ఎం లలిత్ బోహ్రా, ఈస్ట్‌కోస్ట్ రైల్వే వుమెన్స్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ (ఈకార్వో) ప్రెసిడెంట్ జ్యోత్స్న బోహ్రా ప్రారంభించారు. అత్యంత ఖరీదైన, ప్రాణాలను కాపాడే ఇంజక్షన్లు నిల్వ చేసేందుకు ఈ రిఫ్రిజిరేటర్లు ఉపయోగపడతాయని ఆస్పత్రి సిబ్బంది తెలిపారు. వీటి ద్వారా రోగులకు అత్యున్నతమైన వైద్యం, ఉన్నత ప్రమాణాలు గల మందులు అందించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ రైల్వే ఆస్పత్రి చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శరత్ బాబు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల సుడిలో.. చాకలిపేటలు

కానరాని అభివృద్ధి

పట్టించుకోని ప్రజాప్రతినిధులు.. అధికారులు

ఆదుకోవాలని రజకుల మొర



మంథా వారి వీధి చాకలిపేట



అధ్వానంగా యల్లమ్మతోట చాకలిపేట



ఉతికిన దుస్తులను గంగుల గెడ్డలోనే ఆరబెట్టిన దృశ్యం

దాబాగార్డెన్స్: స్వచ్ఛభారత్ నినాదం ప్రతిధ్వనిస్తున్న ఈ రోజుల్లో ప్రజల స్వచ్ఛతకు దోహదపడే దోబీ ఘాట్లు సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నాయి. సమస్యల సుడిగుండంలో చాకలిపేటలు చిక్కుకున్నాయి. జీవీఎంసీ పాలకవర్గం చాకలిపేటలు (దోబీఘాట్)లను విస్మరిస్తోందని పలువురు వాపోతున్నారు. ఫలితంగా దోబీ ఘాట్ల పరిస్థితి అధ్వానంగా మారింది. ఇక్కడ పని చేసే రజకుల అవస్థలు చెప్పనలవి కాదు. నియోజకవర్గ పరిధిలో పధ్నాలుగు వార్డులున్నప్పటికీ, 27వ వార్డు, 29 నుంచి 39, 41, 42వ వార్డు (పార్టు)కి కేవలం నాలుగైదు దోబీఘాట్లే నడుస్తున్నాయి. అవి కూడా గెడ్డలకు ఆనుకుని ఉన్నాయి. ఇక్కడి సమస్యలు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా.. స్పందించే వారే కరువవ్వడంతో రజకులు అవస్థలు పడుతున్నారు.

31వ వార్డు గంగుల గెడ్డ, 28వ వార్డులో ఉన్న చాకలిపేట రజకులు అనేక విధాలుగా బాధపడుతున్నారు.

గెడ్డ చుట్టూ సమస్యలే..

31వ వార్డులో గెడ్డను ఆనుకుని దోబీఘాట్లు నడుస్తున్నాయి. ఎస్‌బీఐ బ్యాంక్ కాలనీ గెడ్డకు ఆనుకుని ఉన్న చాకలిపేట, కనకలదిబ్బ వెనుక భాగాన ఉన్న గంగుల గెడ్డలో సమస్యలు తిష్ట వేశాయి. గెడ్డ ఆధునికీకరణ, చాకలిపేట వాసుల సమస్యల పరిష్కారం కలగానే మిగిలిపోయాయి. ప్రజా ప్రతినిధులు పట్టించుకోవడం లేదు. కనీసం జీవీఎంసీ అధికారులు కూడా పట్టించుకోకపోవడంతో ఇక్కడి రజకులు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చిన్నపాటి వర్షం కురిసినా ఈ గెడ్డల్లో డెబ్రిస్ పేరుకుపోతుంది. ఉతికిన దుస్తులు మురుగు నీటిలోకి వెళ్లి ఆరేయాల్సి వస్తోంది.

దారుణంగా ఇంటి పన్ను.. విద్యుత్ బిల్లు..

ఇదిలా ఉండగా ఈ ప్రాంతంలో 32 ఇళ్లున్నాయి. అందరూ రజకులే. రజక వృత్తినే నమ్ముకున్నారు. 20 గజాలు కూడా లేని స్కీం ఇళ్లకు ఇంటి పన్ను రూ.3 వేలు వస్తోంది. విద్యుత్.. వాటర్ బిల్లు విపరీతంగా వసూలు చేస్తున్నారని వారు వాపోతున్నారు.

నీటి సౌకర్యం కరవు..

జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి కూతవేటు దూరంలోనే దోబీఘాట్లు నడుస్తున్నాయి. రాంనగర్ గెడ్డకు ఆనుకుని ఉన్న దోబీఘాట్‌ను ఎంతో మంది రజకులు వినియోగిస్తున్నారు. నీటి సౌకర్యం లేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 31వ వార్డు చాకలిపేటలో నీటి సమస్య తీవ్రంగా ఉంది. ఈ ప్రాంతంలో ఉన్న బోరింగ్ (రజకుల కోసం వేసినది) నుంచి నీరు రాకపోవడంతో వీరు తీవ్ర అవస్థలు పడుతున్నారు. షెడ్ల కోసం వేసిన రేకులు ఎప్పుడు ఎగిరిపోతాయో.. ఎవరిపై పడతాయోనని భయాందోళనలో ఉన్నారు. అలాగే నౌరోజీ రోడ్డులో ఉన్న చాకలిపేట సమస్యలతో తల్లడిల్లుతోంది. అధికారులు పట్టించుకోకపోవడంతో నిరుపయోగంగా ఉంది.

మోటారు పని చేయడం లేదు..

చాకలిపేటలో బోరు, మోటారు పని చేయడం లేదు. మున్సిపల్ కుళాయి ద్వారా వచ్చే నీటి కోసం పలువురి ఇళ్లకు వెళ్లి తెచ్చుకుంటున్నాం. మా వృత్తికి రెండు మూడు బిందెలతో నీరు సరిపోదు కదా? మా పరిస్థితి అర్థం చేసుకునే నాథుడే కరువయ్యాడు. మా బాధలు ఎవరికీ పట్టడం లేదు. గెడ్డలోనే తాళ్లు కట్టి బట్టలు ఆరేసుకుంటున్నాం.

– శ్రీను, రజకుడు, చాకలిపేట, 31వ వార్డు

గత ప్రభుత్వంలో సంక్షేమ పథకాలందేవి..

గత ప్రభుత్వంలో సంక్షేమ పథకాల ద్వారా ఎంతో కొంత లాభపడ్డాం. వృత్తి పరంగా ఎన్నో ఇబ్బందులున్నా.. కొంత వరకు సంక్షేమ పథకాలు ఆదుకునేవి. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. అటు సంక్షేమ పథకాలు లేక.. ఇటు దోబీ ఘాట్లలో సరైన మౌలిక సదుపాయాలు లేక ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నాం.

– అప్పారావు, రజకుడు, గంగులగెడ్డ.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు



రౌడీషీటర్లకు అవగాహన కల్పిస్తున్న సీఐ వీవీసీఎం యర్రంనాయుడు

అల్లిపురం: టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో గల రౌడీ షీటర్లకు బుధవారం స్టేషన్‌లో సీఐ వీవీసీఎం యర్రంనాయుడు కౌన్సెలింగ్ నిర్వహించారు. రౌడీ షీటర్లను స్టేషన్‌కు పిలిపించి వారు ప్రస్తుతం చేస్తున్న పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఒక్కరు కష్టపడి పని చేసుకుని బతకాలని సూచించారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతూ శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. వారి అడ్రసులు తెలియజేయాలని, రాత్రి సమయాల్లో బీట్ సిబ్బంది వచ్చినప్పుడు ఇంట్లోనే ఉండాలని, పిలిచినప్పుడు స్టేషన్‌కు హాజరు కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ సతీష్, కాంతారావు, సింహాచలం పాల్గొన్నారు.

బీసీ కార్పొరేషన్ రుణాలకు నిధులు విడుదల చేయాలి

మురళీనగర్: రాష్ట్రంలోని వెనుకబడిన వర్గాల పేదలకు బీసీ కార్పొరేషన్ ద్వారా మంజూరు చేసిన రుణాలకు నిధులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఆంధ్రప్రదేశ్ బీసీ సమాఖ్య విశాఖ జిల్లా ఉపాధ్యక్షుడు ఎన్.రవికుమార్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రభుత్వం 2024–25 బడ్జెట్‌లో బీసీలకు వ్యక్తిగత, వ్యాపారాల నిర్వహణకు సబ్సిడీ రుణాలు ఇస్తామని ప్రకటించిందన్నారు. వీరికి రూ.1 లక్ష నుంచి రూ.5 లక్షల వరకు బీసీ కార్పొరేషన్ ద్వారా రుణాలు ఇవ్వాల్సి ఉందన్నారు. ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించి లబ్ధిదారులను ఎంపిక చేసి జాబితాను బ్యాంకులకు పంపారని చెప్పారు. ఈ మేరకు జిల్లాలో 400 యూనిట్లకు 900 మంది లబ్ధిదారులను ఎంపిక చేసినా, నిధులు విడుదల చేయలేదని, తక్షణం నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

ఎండీయూ ఆపరేటర్‌కు వాసుపల్లి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న వాసుపల్లి

దాబాగార్డెన్స్: జీవీఎంసీ 39వ వార్డు చిలకపేటకు చెందిన ఎండీయూ ఆపరేటర్ తిక్కాడ నాయుడు గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో మంచం పట్టాడు. విషయం తెలుసుకున్న వాసుపల్లి నేరుగా నాయుడు ఇంటికి వెళ్లి పరామర్శించారు. కుటుంబ పోషణ కష్టంగా ఉందని తెలుసుకుని మెడికల్ సాయం కింద రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా వాసుపల్లి మాట్లాడుతూ చంద్రబాబు కుట్ర రాజకీయాల వల్ల ఎండీయూ రేషన్ వాహనం ద్వారా ఉపాధి పొందిన తిక్కాడ నాయుడు వంటి 20 వేల మంది ఆపరేటర్లు, హెల్పర్లు ఉపాధి కోల్పోయి రోడ్డున పడ్డారన్నారు. పేదల గుండె చప్పుడు విని జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అందించారని, కేవలం ఆయన కనిపించకూడదన్న అక్కసుతో కూటమి ప్రభుత్వం పేదల ఇంటికి చేరే రేషన్ వాహనాలను రద్దు చేసి ఉపాధి కోల్పోయేలా చేశారన్నారు. అలాగే రాష్ట్రంలో కోటి యాభై లక్షల లబ్ధిదారులను ఇబ్బందులకు గురి చేశారన్నారు. వాసుపల్లి గణేష్‌కుమార్ అంటే నియోజకవర్గంలో ఇప్పటికీ పేదలకు అదే ఆప్యాయత ఉందని బాధితురాలు తిక్కాడ భారతి హారతి ఇచ్చి ఆహ్వానించారు. నాలుగేళ్ల కిందట ఉపాధి లేని తన కుటుంబానికి జగన్‌మోహన్‌రెడ్డి ద్వారా వాసుపల్లి గణేష్‌కుమార్ తన భర్త తిక్కాడ నాయుడుకు ఎండీయూగా ఉద్యోగమిచ్చి ఆదుకున్నారని కొనియాడారు. కూటమి ప్రభుత్వం వచ్చి తన భర్త ఉద్యోగాన్ని తొలగించి, తమ కుటుంబాన్ని రోడ్డున పడేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. వాసుపల్లి సహాయానికి తమ కుటుంబం ఎప్పుడూ రుణపడి ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సనపల రవీంద్రభరత్, పలు వార్డుల అధ్యక్షులు ముజీబ్‌ఖాన్, పీతల వాసు, దశమంతుల మాణిక్యాలరావు, పార్టీ నాయకులు బాబ్జి, ఆకుల శ్యామ్, బెవర మహేష్, గుమ్మడి చంద్రమౌళి, సాగర్, వెంకటి, సత్య, సాయి, దూడ తాతారావు, పడాల సూర్యకుమార్, ఆరుగుల రాజు తదితరులు పాల్గొన్నారు.

పెంచిన విద్యుత్ సర్దుబాటు చార్జీలు రద్దు చేయాలి

- 5న ఈపీడీసీఎల్ కార్యాలయం వద్ద ఆందోళన
- జయప్రదం చేయాలని సీపీఐ శ్రేణుల పిలుపు



కరపత్రం ఆవిష్కరిస్తున్న సీపీఐ జిల్లా కార్యదర్శి షేక్ రెహ్మాన్ తదితరులు

అల్లిపురం: పెంచిన విద్యుత్ సర్దుబాటు చార్జీలు తగ్గించాలి, స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ఉపసంహరించుకోవాలి, అదానీతో జరిగిన విద్యుత్ ఒప్పందాలను రద్దు చేయాలని సీపీఐ డిమాండ్ చేసింది. ఈ మేరకు 5వ తేదీన ఈపీడీసీఎల్ కార్యాలయం వద్ద నిర్వహించే ఆందోళనను జయప్రదం చేయాలని పార్టీ జిల్లా కార్యదర్శి షేక్ రెహ్మాన్ పిలుపునిచ్చారు. అల్లిపురం సీపీఐ కార్యాలయంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆయన కరపత్రాలు ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు తగ్గిస్తామని, స్మార్ట్ మీటర్లను పగలగొట్టాలని, అదానీతో సోలార్ ఒప్పందాన్ని రద్దు చేస్తామని హామీ ఇచ్చిందన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యుత్ చార్జీలను మూడుసార్లు పెంచి ప్రజలపై రూ. 15,487 కోట్ల భారం వేసిందని ఆరోపించారు. మళ్లీ విద్యుత్ చార్జీలు పెంచడం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శులు కె. సత్యనారాయణ పి. చంద్రశేఖర్, సీఎస్ క్షేత్రపాలు, ఎం.మన్మథరావు, ఎస్. నాగభూషణ్, ఎండీ బేగం, అన్వేష్, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం తప్పదు



వాసుపల్లిని కలిసిన పార్టీ లీగల్ సెల్ ప్రతినిధులు

దాబాగార్డెన్స్: కూటమి ప్రభుత్వం అవలంబిస్తోన్న రాజ్యాంగ, ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం చేయాలని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్ కోరారు. ఆశీల్‌మెట్టలోని తన కార్యాలయంలో బుధవారం పార్టీ లీగల్ సెల్ అధ్యక్షుడు బాజీ నాయుడితో పాటు మరి కొంతమంది ప్రతినిధులు వాసుపల్లిని మర్యాద పూర్వకంగా కలిశారు. నియోజకవర్గం లీగల్ సెల్ ఏర్పాటుపై దరఖాస్తులు అందజేశారు. ఈ సందర్భంగా వాసుపల్లి మాట్లాడుతూ ప్రతిపక్షం గొంతు నొక్కుతూ కుట్ర రాజకీయాలు చేస్తున్న చంద్రబాబు సోషల్ మీడియా కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించడం సిగ్గు చేటన్నారు. తాటాకు చప్పుళ్లకు ఎవరూ భయపడే ప్రసక్తే లేదన్నారు. ప్రజలకు చేరాల్సిన ప్రభుత్వ పథకాలు, ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. గతంలోనూ చంద్రబాబు మేనిఫెస్టోను బుట్టదాఖలు చేశారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినా, ఎన్నికల్లో ఇచ్చిన ఏ హామీని సక్రమంగా నెరవేర్చలేదన్నారు. ప్రతిపక్షం టార్గెట్‌గా కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందన్నారు. సూపర్ సిక్స్ తొలి ఏడాది మోసం విలువ రూ.81 వేల కోట్లని, గత ఎన్నికల ముందు కూటమి ఆర్భాటంగా ప్రకటించిన సూపర్‌సిక్స్‌లో అన్నదాత సుఖీభవ, ఆడబిడ్డ నిధి, నిరుద్యోగ భృతి, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 50 ఏళ్లకు పింఛన్ హామీల్లో ఏ ఒక్కటీ అమలు చేయలేదని దుయ్యబట్టారు. అనంతరం జిల్లా లీగల్ సెల్ అధ్యక్షుడు బాజీనాయుడు మాట్లాడుతూ నియోజకవర్గం నుంచి నలుగుర్ని జిల్లా లీగల్ సెల్‌కి నియమించినట్లు తెలిపారు. వైఎస్సార్‌సీపీ బలోపేతమే లక్ష్యంగా, న్యాయపోరాటం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో లీగల్ సెల్ ప్రతినిధులు సయ్యద్ రవి, దాసరి గణేష్, సూరిశెట్టి శ్రీనివాసరావు, ఎస్.అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

మహా వారాహిగా వారాహి మాత



మహా వారాహి మాతగా వారాహి అమ్మవారు

అల్లిపురం: సాయి శ్రీమేరు సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో అల్లిపురంలోని షిర్డీ సాయి దర్బార్‌లో వెలసిన అనఘా లక్ష్మీదేవి ఆలయంలో కొలువై ఉన్న వారాహి అమ్మవారు బుధవారం మహా వారాహి మాతగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు అమ్మవారిని దానిమ్మ గింజలతో విశేషంగా అలంకరించారు. వారాహి హోమం చేపట్టారు. ఈ కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అల్లూరి జయంత్యుత్సవాలకు ఘనంగా ఏర్పాట్లు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

దాబాగార్డెన్స్: బ్రిటీష్ వారిని గడగడలాడించిన మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు 128వ జయంత్యుత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్టు అల్లూరి విజ్ఞాన కేంద్రం కార్యక్రమాల ఇన్‌చార్జి జీఎస్ రాజేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు బుధవారం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో గురజాడ సాంస్కృతిక వేదిక కార్యదర్శి దండు నాగేశ్వరరావు, అధ్యక్షుడు పీవీ రమణ, కోశాధికారి ఆర్ఎస్ఆర్ మూర్తి, బిల్డర్స్ అసోసియేషన్ నాయకుడు జీవీ రవిరాజు, జర్నలిజం స్కూల్ ప్రతినిధి ఎస్.నాగేశ్వరరావుతో కలిసి అల్లూరి జయంత్యుత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాజేశ్వరరావు మాట్లాడుతూ ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 4న మెడికల్ క్యాంపు, 40 పాఠశాలల్లో స్వాతంత్ర్యోద్యమంలో అల్లూరి పాత్రపై వ్యాస రచన పోటీలు, ఆ రోజు మధ్యాహ్నం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు చెప్పారు. గురజాడ వేదిక కార్యదర్శి దండు నాగేశ్వరరావు మాట్లాడుతూ ఉత్సవాల్లో నగరంలోని గాన, కళా బృందాలన్నింటిని భాగస్వాములను చేయాలన్న లక్ష్యంతో గత 20 రోజులుగా వారందర్నీ కలిసి ఉత్సవ వివరాలు తెలియజేశామన్నారు. సాయంత్రం 4 గంటల నుంచి వివిధ కళా రూపాలతో 200 మందికి పైగా కళాకారులు పాల్గొంటున్నారని చెప్పారు. జీవీ రవిరాజు మాట్లాడుతూ ఉత్సవాలు ఇంత ఘనంగా నిర్వహిస్తున్న అల్లూరి విజ్ఞాన కేంద్రం, గురజాడ సాంస్కృతిక సంస్థ ప్రతినిధులను అభినందించారు. కార్యక్రమం విజయవంతం చేసేందుకు సహాయ సహకారాలు అందిస్తానన్నారు. ఉత్సవాల్లో పాల్గొనే కళా బృందాలు, కళాకారులు తమ పేర్లు 9704134498, 9247798787 నంబర్లలో తెలపాలని, ప్రవేశం ఉచితమని చెప్పారు.

ఆక్సిజన్ సరఫరా ద్వారా శిశు మరణాలు తగ్గించవచ్చు



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ సాయి సునీల్ కిషోర్

అల్లిపురం: నవజాత శిశువులకు ఆక్సిజన్ అందించడం ద్వారా శిశు మరణాలు తగ్గించవచ్చని ప్రముఖ నవజాత శిశు వైద్య నిపుణుడు డాక్టర్ సాయి సునీల్ కిషోర్ తెలిపారు. మహారాణిపేట మెడికవర్‌లో మాతా శిశు ఆస్పత్రి సముదాయంలో డబ్ల్యుహెచ్‌వో మార్గదర్శకాలకు అనుగుణంగా వైద్యులు, నర్సులు, ఇతర సిబ్బందికి నిర్వహించిన శిశువుల ప్రాణాలను రక్షించే నైపుణ్యతను పెంపొందించే నీయబ్రీత్ నియోనాటల్ రిసిపిటేషన్ అవగాహన సదస్సులో ఆయన పాల్గొన్నారు. మారుతున్న వాతావరణ పరిస్థితుల కారణంగా ప్రతి సంవత్సరం లక్షలాది మంది నవజాత శిశువులు మొదటి నిమిషంలోనే ప్రాణాంతక సవాళ్లను ఎదుర్కొంటున్నారన్నారు. ఇదే శిశు మరణాలకు ప్రధాన కారణాలలో ఒకటన్నారు. ఈ సమయంలో శిశువును కాపాడటానికి వెంటిలేషన్ ఎయిర్ మేనేజ్‌మెంట్ సిమ్యులేషన్ పరికరాల ద్వారా ఆక్సిజన్ అందించడంలో నైపుణ్యాన్ని మెరుగు పరుచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ విజయకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు కాంట్రాక్ట్ కార్మికులను తక్షణం విధుల్లోకి తీసుకోవాలి



నిరసన కార్యక్రమంలో పాల్గొన్న ఐద్వా సభ్యులు

బీచ్‌రోడ్డు: తొలగించిన స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికులను విధుల్లోకి వెంటనే తీసుకోవాలని ఐద్వా విశాఖ జిల్లా అధ్యక్షులు బి.పద్మ డిమాండ్ చేశారు. బుధవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద చేపట్టిన నిరాహార దీక్ష 1554వ రోజుకు చేరుకున్న సందర్భంగా ఐద్వా సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికులు జీతాలు పెంచాలనో, రెగ్యులర్ చేయాలనో సమ్మె చేయడం లేదని, ప్రభుత్వమే పథకం ప్రకారం కాంట్రాక్టు ఉద్యోగులను తొలగించడం వల్ల వారు ఈరోజు సమ్మెలో ఉన్నారని తెలిపారు. ఇది జీవన్మరణ పోరాటం అన్నారు. ఈ పోరాటానికి ఐద్వా సంపూర్ణ మద్దతు తెలియజేస్తుందన్నారు. ఇప్పటికే మూడు వేల మంది కాంట్రాక్ట్ కార్మికులను తొలగించడాన్ని తీవ్రంగా ఖండించారు. కాంట్రాక్ట్ కార్మికుల్లో ఎక్కువ మంది నిర్వాసితులు ఉన్నారన్నారు. అలాగే భూములిచ్చి త్యాగం చేశారని గుర్తు చేశారు. రెండవ దఫా ఎసెట్ మానిటైజేషన్ చేస్తామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించిందని, ఎక్కడెక్కడి ప్రభుత్వ ఆస్తులను అమ్మేయడం, డబ్బులు చేసుకోవడమే మానిటైజేషన్ అన్నారు. నీతి ఆయోగ్ సమావేశానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ హాజరయ్యారని, అయితే స్టీల్‌ప్లాంట్ గురించి కనీసం మాట్లాడినట్టు వార్తలు రాలేదన్నారు. అంటే స్టీల్‌ప్లాంట్ ను వదిలించుకునే కుట్రలో భాగస్వాములు అయినట్టు భావించాల్సి వస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్. విమల, బి. ఈశ్వరమ్మ, బి. భారతి, కె. కుమారి, జి. లక్ష్మి, డి. కొండమ్మ, వి. ప్రభావతి, కె. సంతోషం, మమత, నిర్మల, హైమావతి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

‘ప్రభుత్వ విధానాలతోనే బీఎస్ఎన్ఎల్‌కు నష్టాలు’



బీఎస్ఎన్ఎల్ కార్యాలయం గేట్ వద్ద నిరసన తెలుపుతున్న కార్మికులు

అల్లిపురం: బీఎస్ఎన్ఎల్ నష్టాలకు ప్రధాన కారణం ప్రభుత్వ విధానాలు తప్ప మరొకటి కాదని పబ్లిక్ సెక్టార్ కో ఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ పీఈసీహెచ్‌వీ సాగర్, జిల్లా అధ్యక్షుడు వి.కూర్మలింగం, త్రినాథ్‌రెడ్డి తదితరులు ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా బుధవారం డాబాగార్డెన్స్‌లో గల బీఎస్ఎన్ఎల్ ప్రధాన కార్యాలయం వద్ద గేట్ డిమాన్‌స్ట్రేషన్ చేపట్టారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ మేరకు ఈ నెల 9వ తేదీన జాతీయ సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులకు వ్యతిరేకంగా కార్పొరేట్లకు అనుకూలంగా ఉన్న నాలుగు లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థలు, ప్రభుత్వ సేవల ప్రైవేటీకరణను ఆపాలని, నేషనల్ మానిటైజేషన్ పైప్ లైన్ విధానాన్ని రద్దు చేయాలనే డిమాండ్లతో సార్వత్రిక సమ్మెకు వెళ్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మె విజయవంతానికి పిలుపు



మాట్లాడుతున్న సీహెచ్ నరసింగరావు

అల్లిపురం: బ్రిటీష్ కాలం నుంచి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను మార్చి కేంద్ర బీజేపీ ప్రభుత్వం 4 లేబర్ కోడ్‌లు తెచ్చింది. దీనివల్ల కార్మికుల ప్రాథమిక హక్కులైన సంఘం ఏర్పాటు, సమ్మె చేయడంతో సహా అనేక హక్కులు కోల్పోతారని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు అన్నారు. లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని 9న దేశవ్యాప్తంగా సమ్మె జరుగుతుందన్నారు. యావత్ కార్మికవర్గం సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం జగదాంబ దరి సీఐటీయూ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయనతో పాటు విశాఖ జిల్లా అధ్యక్షుడు కె.ఎం. శ్రీనివాస్, కార్యదర్శి బి.జగన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నరసింగరావు మాట్లాడుతూ రోజుకు 8 గంటల బదులు 12 పని గంటలు చేయాలని లేబర్ కోడ్‌లు చెబుతున్నాయని తెలిపారు. కార్మికవర్గం సమ్మె చేస్తే ఒకరోజు సమ్మెకు 8 రోజుల జీతం కట్ అవుతుందన్నారు. బీఎంఎస్ లేబర్ కోడ్‌లను సమర్థిస్తూ జూలై 9 నాటి కార్మిక సమ్మెను వ్యతిరేకించడం కార్మికవర్గానికి ద్రోహం చేయడమే అన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించే కేంద్ర ప్రభుత్వ విధానాలను బీఎంఎస్ సమర్థించడం సిగ్గు చేటన్నారు. దీనిని బీఎంఎస్ నాయకత్వం సమర్థించడం విశాఖ స్టీల్‌కు ద్రోహం చేయడమేనన్నారు.

అనాథ బాలబాలికలు, వృద్ధుల సంక్షేమమే లక్ష్యం



నూతన కార్యవర్గం చేత ప్రమాణ స్వీకారం చేయిస్తున్న గౌరవ సలహాదారు విశ్వేశ్వరరావు

మహారాణిపేట: అనాథ బాలబాలికలు, వృద్ధుల సంక్షేమమే ప్రేమ సమాజం లక్ష్యమని, ఆ దిశగా నూతన కార్యవర్గం కృషి చేస్తుందని ప్రేమ సమాజం నూతన అధ్యక్షుడు మట్టపల్లి హనుమంతరావు తెలిపారు. 2025–27 నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవాన్ని బుధవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ముందుగా కంచర్ల అన్నపూర్ణాదేవి ఆడిటోరియంలో జ్యోతి ప్రజ్వలన చేసి సమావేశాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడిగా మట్టపల్లి హనుమంతరావు, కార్యదర్శిగా బి. మోహన్‌రావు, ఉపాధ్యక్షులుగా కె. నరసింహామూర్తి, కె. మల్లికార్జునరావు, కోశాధికారిగా ఎంవీవీకే గుప్తాతో పాటు పలువురు కార్యవర్గ సభ్యులచే గౌరవ సలహాదారు పి. విశ్వేశ్వరరావు ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు మట్టపల్లి హనుమంతరావు మాట్లాడుతూ తన తండ్రి స్వర్గీయ మట్టపల్లి చలమయ్య నుంచి సేవా తత్వం అలవర్చుకున్నట్లు తెలిపారు. అధ్యక్షుడిగా ప్రేమ సమాజం అభివృద్ధికి, బాల బాలికలు, వృద్ధుల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా పూర్వ అధ్యక్షుడు కంచర్ల రామబ్రహ్మం, పైడా కృష్ణ ప్రసాద్, బుద్ధ శివాజీ, మాజీ కార్యదర్శి కోన జగదీశ్వరరావు, వైఎస్ జగన్నాథం, సత్యనారాయణ, తాతారావు, నూతన అధ్యక్షుడితో పాటు సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రేమ సమాజం ఎగ్జిక్యూటివ్ మెంబర్లు, శాశ్వత సభ్యులు, సమాజంలోని బాల బాలికలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.